సొసైటీల్లో కంప్యూటర్ సేవలు

- దస్త్రాలకు చెల్లుచీటి
- ఆన్‌లైన్‌లో పారదర్శకంగా సేవలు

రొంపిచర్ల: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో ముఖ్య పాత్ర వహించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కూడా డిజిటలైజేషన్ వైపు పరుగులు తీస్తున్నాయి. ఏళ్ల తరబడి దస్త్రాలను నిర్వహించే బాధ్యతలు 2024–25 ఆర్థిక సంవత్సరంతోనే తీరిపోయాయి. 2025–26 ఆర్థిక సంవత్సరం నుండి ప్రాథమిక వ్యవసాయ శాఖ సహకార సంఘాలలోని సభ్యులకు పూర్తి స్థాయిలో కంప్యూటర్ సేవలను అందించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తోంది. పీఏసీఎస్‌ల ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు, సభ్యులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు కంప్యూటరీకరణ ప్రక్రియ ఒక్కటే మార్గమని భావించింది. 2022వ సంవత్సరంలో ప్రారంభమై, 2025 మార్చి నాటికి కొలిక్కి వచ్చింది. ఇక నుంచి సంఘాల్లో నిర్వహిస్తున్న మ్యాన్‌వల్ విధానానికి స్వస్తి పలికి, కంప్యూటర్ ఆన్‌లైన్ ఆధారిత సేవలను అందించే ప్రక్రియను ప్రారంభించాయి.

జిల్లావ్యాప్తంగా 60 సంఘాల్లో సేవలు

ఈ నెల 1వ తేదీ నుంచి పీఏసీఎస్‌ల్లో కూడా బ్యాంకుల తరహాలో బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ సేవలను రైతాంగానికి అందించేందుకు కార్యకలాపాలను ప్రారంభించింది. నూతనంగా ఏర్పడ్డ పల్నాడు జిల్లా వ్యాప్తంగా 60 ప్రాథమిక వ్యవసాయ సంఘాలు రైతాంగానికి సేవలు అందిస్తున్నాయి. రైతులకు సీజన్ వారీగా అవసరమైన పంట రుణాలు, స్వల్ప, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను అందజేస్తున్నాయి. వీటితో పాటు రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో పాటు పరపతేతర సేవలు అందిస్తున్నాయి. సహకార సంఘాల వ్యవస్థ ప్రారంభం నుంచి మ్యాన్‌వల్ విధానంలోనే అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ విధానం వల్ల పలు అవకతవకలు, అక్రమాలకు తావుంది. సంఘాలకు అధ్యక్షులు, ఉద్యోగులు కొందరు అక్రమాలకు పాల్పడి రైతుల సొమ్మును కాజేయటం లాంటి సంఘటనలు వెలుగు చూశాయి.

వైఎస్ పాలనలో శ్రీకారం

2004వ సంవత్సరానికి పూర్వం ఎక్కువ సంఘాలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. అప్పట్లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాల్లో మార్పులు తీసుకొచ్చింది. ఆర్థిక సహాయం అందజేసి సంస్కరణలు అమలు పరిచి సొసైటీ వ్యవస్థను తిరిగి మనుగడలోకి తెచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సొసైటీలను డీసీసీబీలకు అనుసంధానం చేసి రైతాంగానికి పారదర్శక సేవలను అందించే ఉద్దేశంతో కంప్యూటరీకరణను ప్రారంభించింది. జిల్లాలో కంప్యూటరీకరణ ప్రక్రియ కూడా మొదలై 2024–25 ఆర్థిక సంవత్సరంలో ముగిసింది. ఈ ఆర్థిక సంవత్సరం నుచి సొసైటీల ద్వారా రైతులకు కంప్యూటర్ ఆధారిత సేవలు పారదర్శకంగా అందనున్నాయి.



పేరుకుపోయిన దస్త్రాలకు చెల్లుచీటి

అవినీతి, అక్రమాలకు చెక్



జాతీయ బ్యాంక్ తరహాలో సంఘంలో కౌంటర్

కంప్యూటరీకరణలో భాగంగా ఆయా పీఏసీఎస్‌ల్లోని సభ్యుల వివరాలను నిర్దిష్టమైన ఫార్మెట్‌లో సేకరించారు. రైతుల భూముల వివరాలు, డిపాజిట్లు, రుణాలు వివరాలన్ని పూర్తి స్థాయిలో సేకరించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. శాస్త్రీయ పద్ధతులో డేటా పూర్తి అందుబాటులోకి తెచ్చారు. సంఘాల్లో ఉన్న యాక్టివ్ సభ్యులకు సచివాలయాల ద్వారా ఈకేవైసీ చేయించారు. పీఏసీఎస్‌లను అన్ని డీసీసీబీలు, ఆప్కాబ్ నబార్డుకు అనుసంధిస్తారు. రైతులు తీసుకున్న రుణాల వివరాలు, వడ్డీ చెల్లింపులు పూర్తి పారదర్శకంగా ఉంటాయి. పాలకవర్గానికి, సిబ్బందికి జవాబుదారీతనం పెరుగుతుంది. దీంతో లోపభూయిష్ట దస్త్రాల నిర్వహణకు చెక్ పడుతుంది. కంప్యూటర్ నిర్వహణ కచ్చితంగా ఉండటమే కాకుండా అవినీతి, అక్రమాలకు ఫుల్‌స్టాప్ పడుతుంది.

మూడు దశల్లో కంప్యూటరీకరణ పూర్తి



పల్నాడు జిల్లాలో ఉన్న 60 సహకార సంఘాల్లో 59 సంఘాల్లో మూడు దశల్లో కంప్యూటరీకరణ పూర్తయింది. అయితే దూళిపాళ్ల సహకార సంఘంలో చివరి దశలో ఉంది. మరో వారం రోజుల్లో ఆ సంఘంలో కూడా చివరి దశ ప్యారలల్ రన్ పూర్తి అవుతుంది. ఈ నెల 1వ తేదీ నుంచి జిల్లాలోని 59 సహకార సంఘాలు సభ్యులకు ఈ–కంప్యూటర్ ఆధారిత సేవలను అందిస్తున్నాయి.

– ఎం. వెంకటరమణ, జిల్లా సహకార అధికారి

క్లుప్తంగా

శరవేగంగా ఆలయ నిర్మాణం



శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ శివారు కృష్ణాపురంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు కమిటీ ప్రతినిధి దమ్మాలపాటి సురేష్ ఆదివారం తెలిపారు. గ్రామస్తులు, దాతలు సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో గత ఏడాది డిసెంబరు 30న పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈనెల 28న ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమై 30న ముగుస్తాయని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో గ్రామస్తులంతా భాగస్వామ్యులు కావడంతో శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



వినుకొండ : పట్టణంలోని గుర్రం జాషువా కళా ప్రాంగణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మందిని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయ పండుగలు జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ వై.వి.నారాయణ, ఆళ్ల శ్రీనివాసరావు, కూచి రామాంజనేయులు, ఎస్‌కే బాజీ, శ్రీనివాసరావు, గిరిబాబు, షేక్ షకీలా, రమేష్, మేఘన, రాజారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు బియ్యం, వస్త్రాల పంపిణీ

వినుకొండ : బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో విద్యానగర్ 4వ లైన్‌లో ఆదివారం నలుగురు పేద బ్రాహ్మణులకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, ఉల్లగంటి బాలగురునాథం, నందిగామ పవన్‌కుమార్, గాయత్రి, కృష్ణమోహన్, ఎం.వి.శర్మ, భువనగిరి సుబ్రహ్మణ్యం, దారా రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచార్యులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ ఆదివారం తెలిపారు. రావిపాడు రోడ్డు లక్ష్మీనారాయణపురం ప్రాంతంలో నివసిస్తున్న కాకుమాను ప్రశాంతి తన భర్త చలపతి అదనపు కట్నం కోసం కొంత కాలంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మృతి



జోగేశ్వరమ్మ (ఫైల్)

నరసరావుపేట: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గోనుగుంట్ల జోగేశ్వరమ్మ (84) ఆదివారం సాయంత్రం స్వగృహంలో మృతి చెందారు. గత తొమ్మిది నెలలుగా ఆమె అనారోగ్యంతో మంచానికే పరిమితమైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆమె 2000–05కాలంలో టీడీపీ తరపున మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఆమెకు ముగ్గురు పిల్లలు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలియజేశారు.

నేడు చిలకలూరిపేటలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నాదెండ్ల:చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో ప్రత్తిపాటి గార్డెన్స్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరవుతారని తెలిపారు. సమస్యలపై ప్రజలు అర్జీలు అందించి పరిష్కారం పొందాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రానికి బీరువా వితరణ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి ఉప ఆరోగ్య కేంద్రానికి రూ. 8వేల విలువైన బీరువాను శనివారం గ్రామానికి చెందిన ముక్కపాటి నాగేశ్వరరావు, కోల్డ్–హాట్ వాటర్ విడుదల చేసే యంత్రాన్ని కాసరగడ్డ వెంకటరత్నం వితరణ చేసినట్లు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పృథ్వీరాణి, ఆరోగ్య కార్యకర్త దాసరి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



నరసరావుపేట: బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ కౌన్సిల్ మెంబర్ వల్లెపు కృపారావు పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ మాట్లాడుతూ దేశాన్ని విశ్వగురువుగా, అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గుడిపల్లి కృష్ణమోహన్, కామినేని హనుమంతరావు, కేతనబోయిన హనుమంతరావు, జిల్లా సంయోజక్ చిరుమామిళ్ల ఆదినారాయణరావు, నాయకులు మేడికొండ కబ్బిరెడ్డి, అడపా గురునాథరావు, కాకుమాను కోటేశ్వరరావు, కార్యాలయ ఇన్‌చార్జి అంజనారెడ్డి పాల్గొన్నారు.

రమణీయంగా రాములోరి కల్యాణం

- వాడవాడలా వేడుకలు
- ఆలయాలు, చలువ పందిళ్లలో వడపప్పు, పానకాలు పంపిణీ

నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలు శ్రీరామనవమి వేడుకలను ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని సత్తెనపల్లి రోడ్‌లో గల శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. స్వామి కల్యాణ వేడుకలను తిలకించారు. అనంతరం వారికి అర్చకుల ఆశీర్వచనం అందజేశారు.

- పాతూరులోని శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయం వంశపారంపర్య ధర్మకర్త మండలి చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో శ్రీరామనవమి పండుగను శోభాయమానంగా నిర్వహించారు. శ్రీపట్టాభిరాముని కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, జమీందార్ రామకృష్ణ కొండలరావు బహదూర్, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్, జనసేన పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ వనమా సాంబశివరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెరుమాళ్ల సత్యనారాయణ వేడుకల్లో పాల్గొన్నారు.
- పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో 108 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులతో పాటు వందలాది మంది భక్తులు ఈ వేడుకలకు హాజరై, స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- పట్టణంలోని పదో వార్డు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ సెయింట్‌జోసెఫ్ స్కూలుకు సమీపంలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, బోయిన శ్రీరామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు డి.అంకిరెడ్డి, కంజుల రోశిరెడ్డి, ఎల్‌బీసీ ఏజెంట్ తియ్యగూర వీరారెడ్డి, న్యాయవాది ఆరే శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.
- స్థానిక మార్కెట్ సెంటర్ పిల్లి నాగన్న సత్రంలోని శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో రాముల వారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. పిల్లి రమేష్, అరుణ కుమారి, పిల్లి సుబ్రహ్మణ్యం, స్వర్ణలత, జొరిగే ఆంజనేయులు, జ్యోతి, ముప్పాళ్ల వంశీకృష్ణ, వైష్ణవి దంపతులు పీటల మీద కూర్చొని కమనీయంగా కల్యాణాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞనారాయణ, పిల్లి నాగన్న సత్రం కమిటీ సభ్యులు మిరియాల నాగప్రసాద్, పిల్లి నాగ మునీంద్రరావు (బుజ్జీ), కాకర్ల రంగారావు, ఆలయ పర్యవేక్షకులు రామిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యడ్లపాడు: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా యడ్లపాడు మండలంలోని రామాలయాలు, హనుమత్ ఆలయాలు ఆదివారం భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా చలువ పందిళ్లలో, గుడి మందిరాల్లో సీతారాముల కల్యాణ ఉత్సవాలు, వడపప్పు, పానకం ప్రసాదాలు పంపిణీ, అన్నదానాలతో సందడి నెలకొంది. ఆలయాల్లోని దేవతా మూర్తులు విశేష అలంకరణలు, ప్రత్యేకలతో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్త రంగులతో, విద్యుత్ దీపాలతో శోభిల్లాయి.

- స్థానిక మెయిన్ రోడ్డులోని రామాలయంలో అర్చకులు పుసులూరి రంగాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు జరిగాయి. కల్యాణ పీటలపై ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పోపూరి సాయి దంపతులు కూర్చున్నారు. గ్రామ పెద్ద కల్లూరి విజయ్‌కుమార్ (బుజ్జి) కుటుంబ సభ్యులు పండుగ నిర్వహణ బాధ్యత, ప్రసాద పంపిణీ చేపట్టారు.
- జగ్గాపురంలోని శ్రీపరివార పట్టాభిరామ దేవస్థానంలో అర్చకులు అప్పలాచార్యుల నేతృత్వంలో మూలవిరాట్‌లకు వివిధ పుష్పాలతో అలంకరణ ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్తలు తులసి రత్తయ్య, బైరిశెట్టి వెంకటేశ్వర్లు, తులసి సుబ్బయ్య, గోవర్ధన్, చాడవరపు రమణయ్య, తెనాలి ఆదిశేషయ్య, తులసి వెంకటయ్య, కోటయ్య పాల్గొన్నారు.
- బోయపాలెంలోని వాల్మీకి నగర్‌లో ఉన్న శ్రీసీతారామలయ దేవస్థానం 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామపెద్దల సహకారంతో ఆలయ ధర్మకర్త, గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరావు, కవిత దంపతులు నేతృత్వంలో వేడుకలు వైభవంగా జరిగాయి.అర్చకులు గోపాలశాస్త్రి ఆధ్వర్యంలో ఆఖండ స్థాపన, సుప్రభాత మేలుకొలుపు, పంచామృత స్నపన, కుంకుమార్చనలు జరిగాయి. ఉదయం 11 గంటలకు భాజాభజంత్రీలు, పండితుల వేదమంత్రాలతో అశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

శావల్యాపురంలో..

మండలంలోని వేల్పూరు, పోట్లూరు, ఇర్లపాడు, కొత్తలూరు,గుర్రంవారిపాలెం, కనమర్లపూడి, వయ్యకల్లు, గుంటుపాలెం,మతుకుమల్లి తదితర గ్రామాల్లో శ్రీ సీతారామ కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శావల్యాపురంలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో పూజారి రావిపాటి సాయిభరత్ సారథ్యంలో కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

నూజెండ్లలో..

మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూజెండ్ల, అప్పాపురం, రవ్వవరం, గుర్రప్పనాయుడుపాలెం, కంభంపాడు, చింతలచెరువు,ఐనవోలు తదితర గ్రామాల్లో నూతన వధూవరులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. నూజెండ్లలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నేతలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో..

మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బండ్లమోటులో ప్రసిద్ధిగాంచిన హిందుస్థాన్ లెడ్ జింక్ మైనింగ్ ప్రారంభం సంవత్సరం 1974 నుంచి కొలువై ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చున్నారు. వేడుకలు అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

వినుకొండలో..

శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా పట్టణంతో పాటు, రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజారు రామాలయంతో పాటు రెడ్డినగర్, ఇందిరా నగర్, రైల్వేస్టేషన్ సెంటర్‌తో పాటు పలు దేవాలయాల్లో కల్యాణాలను ఘనంగా నిర్వహించారు.

- వినుకొండ రూరల్ మండలం కోటప్పనగర్, గోనుగుంట్లవారిపాలెం గ్రామాల్లో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున దంపతులు పాల్గొన్నారు. పెద్దకంచర్ల, నడిగడ్డ, మార్కాపురం, శివాపురం, చీకటిగలపాలెం గ్రామాల్లో వేడుకలు నిర్వహించి, అన్నదానాలు ఏర్పాటు చేశారు.

చిలకలూరిపేటలో..

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామాలయాలతో పాటూ ఆంజనేయస్వామి దేవస్థానాలు కూడా విద్యుత్ దీపాల శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని చలివేంద్రం బజార్, గ్రంథాలయం బజారు, మార్కెట్ సెంటర్, పాట్టి శ్రీరాములు వీధి, తవ్వా బాపనయ్య వీధి, రెడ్ల బజార్, మద్దిమల్లయ్య వీధి, మార్కాండేయనగర్ తదితర చోట్ల చలువ పందిళ్లు వేశారు. వాటికి మామిడి తోరణాలు అలంకరించారు. ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పలు జంటలు వివాహ వేదికపై ఆశీనులై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాదెండ్లలో..

రాముడు పూజించబడ్డ గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని, సీతారామ కల్యాణం లోక కల్యాణమని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన పండితుడు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు చెప్పారు. మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపవరంలోని మహాగణపతి, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కోదండరామ స్వామి దేవస్థానంలో ప్రధాన పూజారి దర్భి అనిల్ కుమార్‌శర్మ బృందం ఆధ్వర్యంలో కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. 54 మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువు నిర్వహించారు. ముఖ్య అతిథిగా భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో గణపవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థినులతో ఉపాధ్యాయుడు నాగేశ్వరాచారి, సూరా శంకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గణపవరం శాంతినగర్‌లోని కోదండరామాలయంలో, కావూరు డొంకలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో కల్యాణం ఘనంగా జరిపారు. సాతులూరు, నాదెండ్ల, కనపర్రు, అమీన్ సాహెబ్‌పాలెం, అప్పాపురం, గొరిజవోలు, సంకురాత్రిపాడు, చిరుమామిళ్ళ, తూబాడు, పలు గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి.

రొంపిచర్లలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీ సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లోని రామాలయాలు, అంజనేయస్వామి ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆ పందిళ్లలో శ్రీ సీతారాములు కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పుణ్యదంపతులు పాల్గొని శ్రీ సీతారాములకు తలంబ్రాలు పోశారు. భక్తులకు ప్రసాదాల పంపిణీతో పాటు కొన్ని గ్రామాల్లో అన్నదానం కూడా చేశారు.



చిలకలూరిపేట మెయిన్ బజారులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న జంటలు



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు



శ్రీ పట్టాభిరామస్వామి కల్యాణంలో పాల్గొన్న ఎంపీ లావు, ధర్మకర్త సుబ్బరాయగుప్తా



సెయింట్ జోసెఫ్ స్కూలు వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



జగ్గాపురం రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



నూజెండ్లలో జరిగిన కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నాయకులు



గణపవరంలో కల్యాణానికి హాజరైన భక్తులు



బండ్లమోటు రామాలయంలో వేడుకలు



యడ్లపాడు రామాలయంలో వేడుకలు

పండగ రోజు కూడా మాకు పస్తులేనా?

- మున్సిపల్ కార్మికుల ఆగ్రహం
- 18 రోజుకు చేరిన నిరవధిక సమ్మె

నరసరావుపేట: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం 18 రోజుకు చేరుకున్నాయి. శ్రీరామనవమి పండుగను సైతం ఖాతరు చేయకుండా నిరాహార దీక్ష చేపట్టారు. కార్మికులకు పూలమాలలు వేసి దీక్షలను సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌వలి ప్రారంభించారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని తెలిపారు. ఏపీ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో పేర్లు నమోదైనా వివక్ష చూపిస్తున్నారని ఆరోపించరు. మున్సిపల్ అధికారులు ఇచ్చే వేతనాలతో అరకొర వేతనాలతో ఇంటిల్లి పాది ప్రతిరోజు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అధికారులు తీరు మారకపోతే నిరవధిక నిరాహార దీక్షలు చేయడానికి వెనకాడబోమని కార్మికులు హెచ్చరించారు. నిరసలో కార్మికులు జొన్నలగడ్డ వీరమ్మ, సమాధానం, సెల్వి, లత, నాగమణి, శ్రీను, చంద్రయ్య, రాజు, ఖాదర్‌వలీ, వీరయ్య, సాంబయ్య, అబ్రహం, సాల్మన్, దేవా పాల్గొన్నారు. యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, యూనియన్ నాయకులు జీవరత్నం, వీర కుమార్, నవీన్ సంఘీభావం తెలిపారు.



దీక్షలో కూర్చున్న పారిశుద్ధ్య కార్మికులకు దండలు వేస్తున్న నాయకులు

మాంసం దుకాణాలపై దాడులు



నరసరావుపేట టౌన్: పట్టణంలోని పలు మాంసం దుకాణాలపై జిల్లా కల్తీ ఆహార నియంత్రణ శాఖ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంయుక్తంగా ఆదివారం దాడులు చేశారు. బాలయ్యనగర్‌కు చెందిన రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూ వ్యాధితో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని చికెన్, మటన్ దుకాణాలతో పాటు పలు హోటళ్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. జీవాలు, కోళ్లు ఎక్కడ నుంచి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారని ఆరా తీశారు. మాంసం విక్రయ కేంద్రాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పలు రెస్టారెంట్లలో తనిఖీలు చేశారు.